
సాక్షి
అనంతపురం
గురువారం । 29 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు ప్రకారం విక్రయాలు జరిగాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. మార్కెట్‌కు 3,800 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
$34.2^{\circ}/23.6^{\circ}$

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

తల్లి సాయంతో తండ్రిని హతమార్చిన కుమారుడు


మృతుడు తిప్పేస్వామి నాయక్ (ఫైల్)

బెళుగుప్ప: కన్న కొడుకే తండ్రిని హతమార్చిన ఘటన మండల పరిధిలోని యలగలవంక తండా గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..యలగలవంక తండా గ్రామానికి చెందిన తిప్పేస్వామినాయక్ (53), లక్ష్మీబాయి దంపతులకు ఒక కుమారుడు రాజశేఖర్ నాయక్, కుమార్తె జ్యోతిబాయి ఉన్నారు. మద్యానికి బానిసైన రాజశేఖర్‌నాయక్ అప్పులు ఎక్కువగా చేశాడు. దీంతో పాటు ఇష్టారాజ్యంగా తిరుగుతుండడంతో తండ్రి మందలించేవాడు. ఈ క్రమంలో ఇద్దరూ గొడవ పడేవారు. మంగళవారం గ్రామంలో మారెమ్మ జాతర జరిగింది. ఈ సందర్భంగా ఇద్దరూ మద్యం సేవించి రాత్రి గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన రాజశేఖర్ నాయక్ తన తండ్రి తిప్పేస్వామినాయక్ గొంతు నులిమి హతమార్చాడు. గొడవలో తల్లి లక్ష్మీబాయి కూడా కుమారుడికి సహకరించినట్లు తెలిసింది. ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ శివ, ఏఎస్‌ఐ రామదాసులు బుధవారం గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుమార్తె జ్యోతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ రేపు

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరపాలక సంస్థలో ఈ నెల 30న సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ శ్రీహరి బాబు పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి ఆదేశాల ప్రకారం కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు నగరపాలక సంస్థలోని న్యూ కాన్ఫరెన్స్ హాలులో వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, శానిటేషన్ కార్యదర్శులకు, కౌన్సిల్ హాలులో ప్లానింగ్ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు సంబంధించి దాదాపు 150 మంది వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, శానిటేషన్, ప్లానింగ్ కార్యదర్శులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.



ఆస్పత్రుల్లో భద్రత పెంచాలి


కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చట్టాలను తీసుకురావాలి. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందికి మరింత భద్రత కల్పించాలి. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేని పరిస్థితులు రాకూడదు. ప్రభుత్వాలు స్పందించి దుండగులకు కఠిన శిక్షలు విధించినప్పుడే మరొకరు తప్పు చేయడానికి భయపడతారు. వైద్యులు స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వర్తించగలుగుతారు. – కార్తీక్‌రెడ్డి, బెళుగుప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి



పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి

అత్యవసర సమయంలో రోగి ప్రాణాలు కాపాడే వైద్యులు, సిబ్బందికి రక్షణ లేకుండా పోతోంది. రోజూ అభద్రతాభావంతోనే విధులకు హాజరవుతున్నాం. ఎప్పుడు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందో అర్థం కావడం లేదు. ప్రతి ఆస్పత్రిలోనూ రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలి. రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ చేపట్టి వైద్యులు, సిబ్బందిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలి. – డాక్టర్ మహేష్, సీహెచ్‌సీ, పామిడి

భూచోళ్లున్నారు జాగ్రత్త!



● ఇది అనంతపురం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న రుద్రంపేట పంచాయతీ వికలాంగుల కాలనీ పక్కన కక్కలపల్లి పొలం 99-1 సర్వే నంబరులోని 7.12 ఎకరాల భూమి. గుగ్గిళ్ల నాగిరెడ్డి కుటుంబానికి చెందిన ఈ భూమిపై టీడీపీ నాయకులు కన్నేశారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజే తహసీల్దార్ కార్యాలయంలో 1-బీలోకి ఎక్కించుకున్నారు. పాసుబుక్కులు తీసుకున్నారు. రూ. 13 కోట్లకు పైగా విలువ చేసే ఈ భూమిని సర్వే చేయించి పొజిషన్‌లోకి వెళ్లేందుకు యత్నించారు. బాధిత కుటుంబ సభ్యులు అడ్డుకుని గొడవ చేయడంతో వెనక్కుతగ్గారు.

- అధికారంలోకి వచ్చీరాగానే భూముల ఆక్రమణలు, అక్రమ లేఔట్లు
- వివాదంలో ఉన్న భూముల్లో పాగా
- దేవదాయ భూములనూ వదలని వైనం
- ప్రభుత్వ ఆదాయానికి కోట్లాది రూపాయల గండి
- చేష్టలుడిగి చూస్తున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ నేతలు వివాదాల్లో ఉన్న భూములపై కన్నేశారు. అనంతపురం రూరల్, రాప్తాడు, గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం, శింగనమల ప్రాంతాల్లో అధికార పార్టీ ముఖ్య నాయకులు ఇందుకోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. వారు ఉదయం లేచినప్పటి నుంచి ఇలాంటి వాటిని గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిసింది. చివరకు ఏళ్ల చరిత్ర కల్గిన దేవాలయాల భూములపైనా కన్నేసి వాటినీ చెరపడుతున్నారు. మూడు రోజుల క్రితం పామిడి మండలం ఎద్దులపల్లి రోడ్డులోని ఆంజనేయస్వామి మాన్యంలో టంగటూరి సత్రాన్ని రెండు జేసీబీలు పెట్టి కూలదోయించడమే ఇందుకు నిదర్శనం.

ఇష్టారాజ్యంగా లేఔట్లు..

అధికార అండతో టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా లేఔట్లు వేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్రమ లేఔట్లపై దృష్టి సారించారు. అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) అధికారులతో సర్వే చేయించి 2022 నాటికి 2,500కు పైగా అక్రమ లేఔట్లను గుర్తించారు. అసైన్డ్ భూముల్లో వేసిన లేఔట్లు, వ్యవసాయేతర భూములుగా మార్చుకోకుండానే వేసిన లేఔట్లను గుర్తించి జాబితాను రిజిస్ట్రేషన్ శాఖకు పంపి నిబంధనల ప్రకారం సక్రమం చేసుకుంటే తప్ప ఆయా లేఔట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయొద్దని ఆదేశించారు. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమ లేఔట్ రిజిస్ట్రేషన్లకు చెక్ పడింది. అయితే, ఎన్నికల ముందు కొందరు టీడీపీకి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. ఈ క్రమంలో అక్రమార్కులు రిజిస్ట్రేషన్ అధికారులతో మాట్లాడుకుని విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ వచ్చారు. ఓ వైపు ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం చేకూరుతున్నా కేవలం తమ వారికి మేలు జరుగుతోందన్న కారణంగా కూటమి ప్రభుత్వం దీనిపై ఏమాత్రమూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అన్నీ తెలిసీ మౌనం..

కూటమి పార్టీల నాయకులు సాగిస్తున్న భూదందాలు, అక్రమ లేఔట్ల వ్యవహారం అధికారులకు తెలిసినా మౌనంగా ఉంటున్నారు. అనంతపురం రూరల్ మండలంలో వెలసిన ఓ అక్రమ లేఔట్ నిర్వాహకులకు సహకరిస్తుండడమే ఇందుకు నిదర్శనం. రూరల్ మండలంలోని కొడిమి గ్రామ శివారు ఇండియన్ గ్యాస్ గోడౌన్ పక్కన ఎకరా స్థలంలో మూడు నెలల క్రితం ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే లేఔట్ ఏర్పాటు చేశారు. కేవలం అధికార పార్టీ పేరు చెప్పుకుంటూ ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు ఎగనామం పెడుతున్నారు. అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకుని పంచాయతీలకు ఆదాయం తీసుకురావాల్సిన కొందరు పంచాయతీ కార్యదర్శులు అందిన కాడికి అక్రమార్కుల నుంచి దండుకుని పై అధికారులకు మాత్రం నాయకుల పేర్లు చెబుతున్నారు. ఫలానా అధికారికి ఫోన్ చేసి చెప్పండంటూ నాయకులకు సలహా ఇచ్చి పంపుతున్నట్లు తెలిసింది.

● ఇక్కడ కనిపిస్తున్న లేఔట్ అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలోని 213-3 సర్వే నంబరులో 4 ఎకరాల్లో వెలిసింది. ఇది ప్రభుత్వ అసైన్డ్ భూమి. గతంలో కలెక్టర్ ఎన్‌ఓసీ ఇవ్వగా.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కొనుగోలు చేసిన కూటమి పార్టీల చోటా నాయకులు వెంటనే అభివృద్ధి చేశారు. కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేశారు. మొత్తం 74 ప్లాట్లు వేశారు. సెంటు రూ. 3.5 లక్షలతో అమ్మకానికి పెట్టారు. పంచాయతీకి 40 సెంట్ల స్థలం స్వాధీనం చేయాల్సి ఉండగా.. అరసెంటు కూడా ఇవ్వలేదు. అహుడా నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. ఎవరు అడిగినా టీడీపీ, జనసేన పార్టీల పేరు చెప్పుకుంటూ బెదిరిస్తున్నారు. ఓ నేతకు వాటా ఇవ్వడంతో ఆయన వీరికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నారు. ఈ లేఔట్‌తో పంచాయతీకి, అహుడాకు దాదాపు రూ. 2 కోట్ల నష్టం వాటిల్లుతోంది.



'పచ్చగద్దల' దురాక్రమణ నిజమే!

- ప్రాథమికంగా తేల్చిన అధికారులు


అభయాంజనేయస్వామి ఆలయ ప్రహరీ, సత్రం కూల్చివేత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పామిడి: 'పచ్చ గద్దల' భూ దాహం నిజమేనని తేలింది. మాన్యాన్ని దురాక్రమించేందుకు వారు పన్నిన పన్నాగం ప్రాథమికంగా బయటపడింది. పామిడి సమీపంలో ఎద్దులపల్లి రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రహరీతో పాటు సత్రాన్ని ఇటీవల టీడీపీ నాయకులు కూల్చివేశారు. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు కదిలారు. ఆంజనేయ స్వామి మాన్యాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ సత్రం మొత్తం నేలమట్టం చేశారన్నారు. ఆంజనేయ స్వామి ఆలయ ప్రహరీని తొలగించకుండా ఉండాల్సిందన్నారు. పురాతన కట్టడాలకు సంబంధించిన వాటి తొలగింపునకు తప్పనిసరిగా అధికారుల అనుమతి అవసరమన్నారు. 1911 సంవత్సరంలో పెద్ద సుబ్బయ్య కుటుంబసభ్యుల నుంచి టంగుటూరి తిమ్మన్న కుటుంబసభ్యులకు భూములు సంక్రమించాయన్నారు. ఆ భూముల్లో అభయాంజనేయస్వామి ఆలయం, దాన్ని ఆనుకొని సత్రం నిర్మించారన్నారు. ఈ విషయంపై దేవదాయ, పురావస్తు శాఖ అధికారులతో కలిసి లోతుగా అధ్యయనం చేసి కలెక్టర్‌కు నివేదిస్తామని ఆయన తెలిపారు.

కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి

దేవుని మాన్యాన్ని సైతం మింగాలని చూసిన వారిపై తక్షణం క్రిమినల్ కేసులు కట్టాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డికి ఐక్య మాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజు కాలువ వెంకటేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఎంసీ సుంకన్న, దళిత నేతలు కుమార్, లాలెప్ప వినతిపత్రం అందజేశారు. అధికార పార్టీ నేతల అండదండలతోనే కోట్ల రూపాయలు విలువ చేసే పవన పుత్రుని మాన్యాన్ని కాజేయాలని చూశారన్నారు. దేవుని మాన్యం గద్దల పాలు కాకుండా చూడాలని వారు కోరారు.

సమీక్షలతో సరి.. పర్యటనలు హరీ

- రోజంతా సమావేశాలతో సరిపెడుతున్న కలెక్టర్
- అటకెక్కిన క్షేత్రస్థాయి పర్యటనలు
- వరుస సమావేశాలపై రెవెన్యూ అసోసియేషన్ అసంతృప్తి
- తమకు మినహాయింపు ఇవ్వాలని నేడో రేపో వినతి
- హాస్టళ్లలో పరిస్థితులు అంచనా వేయలేకనే ఇంటర్ విద్యార్థి మృతి


కలెక్టరేట్‌లో నిత్యం ఇలాంటి సమావేశాలెన్నో

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కొత్త ప్రభుత్వం వచ్చాక పాలన గాడి తప్పింది. ఎవరు ఎక్కడికెళుతున్నారు, ఎక్కడ పనిచేస్తున్నారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ముఖ్యంగా కలెక్టర్ నిత్యం సమావేశాలంటూ అధికారులను తన చుట్టూనే తిప్పుకుంటున్నారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో పర్యటించే వారు కరువయ్యారు. గతంలో ఆయా విభాగాల అధికారులు తరచూ మండలాలకు వెళ్లి పరిస్థితులు అంచనా వేసేవారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' పేరుతో ప్రజాప్రతినిధులు తిరిగినప్పుడు అధికారులు కూడా వారి వెంట వెళ్లేవారు. ఏవైనా సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. రెండు మాసాలుగా ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ అటకెక్కింది. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసే దిక్కు లేకుండా పోయింది.

గంటల తరబడి సమావేశాలే..

గత ప్రభుత్వ హయాంలో సోమవారం 'స్పందన' మినహా మిగతా రోజుల్లో అవసరముంటే తప్ప అధికారులతో గంటల తరబడి కలెక్టర్లు సమావేశాలు నిర్వహించేవారు కాదు. కానీ ప్రస్తుతం ప్రతిరోజూ ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుకు సంబంధం లేని అధికారులను కూడా పిలిపించుకుని గంటల తరబడి మాట్లాడుతున్నారు. కొంతమంది అధికారులైతే తమ కార్యాలయాల్లో ఫైళ్లు చూడడానికి కూడా అవకాశం లేకుండా పోతోందని, ప్రతిరోజూ కలెక్టరేట్‌లోనే ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. రోజూ సుమారు 106 విభాగాల అధికారులు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో, రెవెన్యూ భవన్‌లో జరిగే సమావేశాలకు విధిగా హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త ప్రభుత్వం వచ్చాక క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో తమకే తెలియడం లేదని పలువురు అధికారులు వాపోతున్నారు. సమావేశాల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని రెవెన్యూ అధికారుల అసోసియేషన్ ఏకంగా కలెక్టరుకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు తెలిసింది.

సమస్యలున్నా పట్టించుకునే వారు లేరు

జిల్లాలో కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం కారణంగా ఇప్పటివరకూ 68 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నప్పటికీ రైతులు గట్టెక్కే పరిస్థితులు లేవు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలులో చిత్తశుద్ధి కన్పించడం లేదు. కౌలు రైతులకు సాయం అందడం లేదు. యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉంది. మరోవైపు రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఉపాధి హామీ పనులకు సంబంధించి బకాయిల కోసం కూలీలు ఎదురు చూస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. పాములు కరిచి ఇటీవల పలువురు మృతిచెందారు. రాజకీయ ప్రోద్బలంతో అర్హుల పింఛన్లు సైతం తొలగిస్తున్నారు. జిల్లా అంతటా ఇసుక ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ఇలా ఎన్నో సమస్యలు క్షేత్రస్థాయిలో ఉత్పన్నమవుతున్నా.. ఉన్నతాధికారులు జిల్లా కేంద్రం దాటి బయటకు రావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అటకెక్కిన హాస్టళ్ల తనిఖీ

జిల్లాలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో పరిస్థితులు అంచనా వేసే దిక్కులేదు. ఫలితంగా ఈ నెల 26న అనంతపురం రూరల్ పరిధిలోని బీసీ హాస్టల్‌లో తేజ అనే ఇంటర్మీడియట్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అనంతపురం నగరానికి కూతవేటు దూరంలోని ఈ హాస్టల్లోనే పరిస్థితులను అంచనా వేయలేకపోయారు. ఇక మిగతా హాస్టళ్లలో ఊహించలేమని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు.

పుట్టిన రోజుకు కొత్త బట్టలు తెచ్చా లే నాన్నా!

- జన్మదినం రోజే మృతి చెందిన కుమారుడు
- గుండెలవిసేలా విలపించిన తల్లిదండ్రులు


ఆజీం మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు (ఇన్‌సెట్‌లో) ఆజీం (ఫైల్)

ఉరవకొండ: 'ఆజీం లే నాన్నా.. ఈ రోజు నీ పుట్టిన రోజు.. కొత్త బట్టలు తెచ్చాం. నీ స్నేహితులు, టీచర్లకు చాక్లెట్లు పంచి పెట్టాలి' అంటూ ఆ తల్లిదండ్రులు విలపించిన తీరు అందరి కంట కన్నీళ్లు తెప్పించింది. పుట్టిన దినం రోజే ఓ బాలుడు మృతి చెందిన విషాద ఘటన ఉరవకొండ పట్టణంలో జరిగింది. వివరాలు.. స్థానిక పాత మార్కెట్ సమీపంలో చాపదేవుని గుడి వద్ద నివాసముంటున్న అయ్యూర్ బాబా ఫకృద్దీన్ ఉరవకొండ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయనకు భార్య హుమేరా ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఆజీం బాషా (14) సంతానం. బాలుడు ఉరవకొండ పట్టణంలోని ఓ ప్రయివేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం తీవ్ర జ్వరం బారిన పడ్డాడు. దీంతో తల్లిదండ్రులు ఉరవకొండలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. ఈ క్రమంలోనే రక్త కణాలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో అత్యవసరంగా అనంతపురంలోని కార్పొరేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స ఫలించక బుధవారం ఉదయం అజీంబాషా కన్నుమూశాడు.

శోకసంద్రం.. : బుధవారం అజీంబాషా జన్మదినం. కుమారుడి పుట్టినరోజును ఘనంగా జరపాలనే ఉద్దేశంతో ఇప్పటికే తల్లిదండ్రులు ఏర్పాట్లు చేశారు. కుమారుడికి కొత్త దుస్తులు కూడా తెచ్చారు. సంతోషంగా ఉన్న సమయంలో ఆజీంబాషా మృతితో వారి బాధ వర్ణనాతీతంగా మారింది. ఎంతో ఉల్లాసంగా, అందరితో కలివిడిగా ఉండే ఆజీంబాషా మృతితో పాత మార్కెట్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌ఐ గురికాల శివ, కానిస్టేబుళ్లు కులశేఖర్‌రెడ్డి, ఓబుళేసు తదితరులు సంతాపం తెలిపారు.

సగానికి పడిపోయిన సాగు విస్తీర్ణం

- 1.10 లక్షల హెక్టార్ల అంచనాకు చేరిన ప్రత్యామ్నాయ పంటల సాగు


శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ యల్లప్ప

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా చరిత్రలో తొలిసారిగా వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. జూన్ 15 నుంచి ఆగస్టు 15 వరకు దాదాపు రెండు నెలల పాటు నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు గడువు ముగియడంతో ప్రధానపంటల జాబితాలో ఉన్న వేరుశనగ, పత్తి సగానికి పడిపోయాయి. అయితే ఇదే జాబితాలో ఉన్న కంది, ఆముదం, మొక్కజొన్న సాగు పెరగడం విశేషం. మొత్తానికి వ్యవసాయశాఖ తాజా నివేదిక ప్రకారం 3,46,733 హెక్టార్ల అంచనాకు గాను 68 శాతం విస్తీర్ణంతో 2,35,723 హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. ఇక మిగిలిన 1.10 లక్షల హెక్టార్లలో ఉలవ, పెసర, అలసంద, కొర్ర, జొన్న, మినుము లాంటి పంటలతో ప్రత్యామ్నాయం కింద సాగు చేయాల్సి ఉంది.

సగానికి తగ్గిన వేరుశనగ, పత్తి

ఈ ఖరీఫ్‌లో 1.97 లక్షల హెక్టార్లలో వేరుశనగ పంట సాగులోకి వస్తుందని అధికారికంగా అంచనా వేశారు. అయితే 45 శాతంతో 95,546 హెక్టార్ల విస్తీర్ణంలో సాగులోకి వచ్చింది. అలాగే పత్తి కూడా 48,586 హెక్టార్ల అంచనాకు గానూ 55 శాతం 26,784 హెక్టార్లలో సాగులోకి వచ్చింది. కంది పంటపై రైతులు బాగా మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. 37,367 హెక్టార్లు అంచనాకు గాను 174 శాతంతో 64,836 హెక్టార్లలో సాగైంది. అలాగే 16,340 హెక్టార్లకు గానూ 114 శాతంతో 18,805 హెక్టార్ల ఆముదం, 105 శాతంతో మొక్కజొన్న, 163 శాతంతో సజ్జ, 127 శాతంతో మినుము, 232 శాతంతో కొర్ర సాగులోకి వచ్చాయి. వరి నాట్లకు ఇంకా సమయం ఉన్నందున విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి

- కలెక్టర్ వినోద్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి ఆయన నిర్వహించారు. ఇప్పటి వరకూ లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు ఎంత మేర అందాయనేదానిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు

వయోవృద్ధుల సంక్షేమాన్ని కర్తవ్యంగా భావించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వయోవృద్ధుల సంక్షేమంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాటాడుతూ జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్‌లో వయోవృద్ధుల సమస్యల కోసం రిజిస్టర్ ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో వయోవృద్ధుల కోసం సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సోమవారం జరిగే ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వృద్ధుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేయాలని చెప్పారు. వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్‌లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ల వారీగా వయోవృద్ధుల కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్‌డీఓలు రాణిసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయండి

ఎన్టీఆర్ భరోసా పథకం కింద సెప్టెంబరు ఒకటో తేదీ ఉదయమే పింఛన్ల పంపిణీ మొదలుపెట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పింఛన్ల పంపిణీ అంశంపై బుధవారం కలెక్టరేట్ నుంచి డీఆర్‌డీఏ, బ్యాంకు అధికారులు, ఎంపీడీఓలు, ఏపీఎంలు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలి రోజే వంద శాతం పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్లుప్తంగా

వైభవంగా జైనబ్బీ అమ్మవారి గంధం వేడుకలు



అమ్మవారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

ఉరవకొండ: ప్రసిద్ధి గాంచిన పాక్‌దామన్ హజ్రత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గంధం వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాల వాహనంలో అల్లప్పరెడ్డి ఇంటి నుంచి గంధను ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. అనంతరం అమ్మవారి జీవసమాధి వద్ద గంధం ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు జిల్లా నలమూలల నుంచే కాక కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దర్గా పరిసరాలు జనసంద్రమయ్యాయి. దర్గా కమిటీ అధ్యక్షుడు హోతురూ బాషా, కార్యదర్శి జీఎంఎస్ షాకీర్, కోశాధికారి జెండా జిలాన్, ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, సహాయ కార్యదర్శి గంగవరం శర్మాస్‌వలి, అసోసియేట్ అధ్యక్షుడు పామిడి జాకీర్, టీం మేనేజర్ బళ్లారి సాదిక్, బొంబాయి సేట్ మైను, మెకానిక్ రహిమాన్, వన్నూర్‌సాహెబ్, బేల్దార్ శర్మాస్, కణేకల్లు యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు నిత్యావసరాలు అందించండి

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఉన్న అనాథ పిల్లలకు రేషన్, ఆధార్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు ప్రతి నెలా వారికి అవసరమైన నిత్యావసర సరుకులు అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా పంచాయతీ, సివిల్ సప్లయిస్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అభాగ్యులను ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బెటాలియన్ కమాండెంట్‌గా ప్రభుకుమార్



బాధ్యతలు చేపడుతున్న ప్రభుకుమార్

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా ప్రభుకుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న అమిత్‌బర్ధర్‌ను కోనసీమ జిల్లా ఎస్పీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్నూలులో ఉన్న 2వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ప్రభుకుమార్‌ను పదోన్నతిపై 14 బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

భద్రత కట్టుదిట్టం చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. కోల్‌కతాలో వైద్యురాలి పట్ల జరిగినలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను కఠినతరం చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించే వైద్యులు భయపడకుండా విధులు నిర్వర్తించే వాతావరణాన్ని కల్పించాలి. వైద్యులు, సిబ్బందిపై దుర్ఘటనలు చోటు చేసుకుంటే ప్రభుత్వం తక్షణమే స్పందించి దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలి.

– లోకేష్, శ్రీరంగాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి, బెళుగుప్ప మండలం



శిక్షలు కఠినతరం చేయాలి



కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన పాశవిక ఘటన చాలా దుర్మార్గం. ప్రాణాలను కాపాడే డాక్టర్లకే భద్రత కల్పించకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. ఇటీవల మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయి. రోజూ ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మహిళలకు భద్రత పెంచాలి. శిక్షలు కఠినతరం చేయాలి.

– డాక్టర్ రవినాయక్, ఎస్ఎస్‌గేట్ పీహెచ్‌సీ, చెన్నేకొత్తపల్లి మండలం

ఖతర్నాక్ కిలేడీలు!

- దొంగతనాల్లో ఆరితేరిన మహిళలు
- ఉమ్మడి జిల్లాలో పేట్రేగిపోతున్న వైనం
- బస్సుల్లో ప్రయాణిస్తూ దృష్టి ఏమార్చి బంగారు నగల అపహరణ
- ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన ముఠాలు



ఈ నెల 26న ఆత్మకూరు వద్ద దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న నగలు



'శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల పరిధిలో ఈ నెల 12న ముగ్గురు మహిళా దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బత్తలపల్లి నుంచి స్వగ్రామానికి బయలుదేరిన పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన రాధమ్మతో పాటు బస్సు ఎక్కిన వారు కాసేపటికే ఆమె బ్యాగ్‌లో నుంచి బంగారు నగలు అపహరించి, మధ్యలోనే స్టేజ్ దిగేశారు. కాస్త ముందుకు వెళ్లిన తర్వాత విషయాన్ని గుర్తించిన బాధితురాలు వెంటనే బస్సు దిగి వెనక్కు వస్తూ సదరు మహిళలను గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని 8 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.



ఈనెల 26న కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి బయలుదేరిన బస్సులో ఎక్కిన ఈ నలుగురు మహిళలు... అదే బస్సులో ప్రయాణిస్తున్న పెద్ద వడుగూరు మండలం శ్రీదేవితో పాటు కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన నాగలక్ష్మి వద్ద నుంచి బంగారు నగలు అపహరించి ఆత్మకూరులో బస్సు దిగేశారు. నగలు పోయిన విషయం ఆలస్యంగా గుర్తించిన బాధితులు వెంటనే ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆత్మకూరు పోలీసులు బృందాలుగా విడిపోయి గంటల వ్యవధిలోనే ఆ నలుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారు నగలు స్వాధీనం చేసుకుని, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆత్మకూరు: దృష్టి ఏమార్చి బంగారు నగలు అపహరించుకెళ్లే ముఠా సభ్యులు పేట్రేగి పోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్సుల్లో ప్రయాణించేందుకు మహిళలు భయపడుతున్నారు. అయితే ఈ దొంగతనాలకు పాల్పడుతున్నది ఏ యువకులో... పురుషులో అనుకుంటే పొరబడినట్లే. ఈ తరహా కేసుల్లో ఇప్పటి వరకూ పోలీసులకు పట్టుబడింది మహిళలే కావడం గమనార్హం.

వ్యసనాలకు అలవాటు పడి...

వ్యసనాలకు బానిసైన కొందరు మహిళలు... తమ అవసరాలు తీర్చుకునేందుకు కరుడుకట్టిన దొంగలుగా మారారు. వీరిలో జిల్లాకు చెందిన వారితో పాటు పొరుగు జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వచ్చిన వారూ ఉన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలనే లక్ష్యంగా చేసుకుని వీరు బంగారు నగలు అపహరిస్తున్నారు. ఇటీవల గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, కళ్యాణదుర్గంతో పాటు శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో పట్టుబడిన ముగ్గురు మహిళలు తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ముగ్గురూ ఓ బృందంగా ఉంటూ బస్సుల్లో ప్రయాణిస్తూ మహిళల నుంచి బంగారు నగలు అపహరించి, ఆ తర్వాత వాటాలు పంచుకునేవారు. అయితే పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన ఓ మహిళ నుంచి బంగారు నగలు అపహరించిన తర్వాత వాటాలు పంచుకోవడంలో తేడా రావడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ పోలీసులకు పట్టుబడ్డారు.

కాస్త ముస్తాబైతే చాలు..

దొంగతనాలకు అలవాటు పడిన మహిళలు ప్రధానంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారినే లక్ష్యంగా చేసుకోవడం గమనార్హం. కాస్త ముస్తాబైన మహిళలు కనిపిస్తే చాలు వారిని అనుసరిస్తూ అందరికంటే ముందుగానే బస్సు ఎక్కేస్తారు. అనంతరం తమ పక్కనే సీటు ఖాళీగా ఉందని ఆఫర్ చేసి మాట కలుపుతారు. ఈ క్రమంలోనే వారి దృష్టి ఏమార్చి బ్యాగ్‌లోని నగలు, విలువైన సామగ్రిని అపహరించి ఏమీ తెలియని వారిలా మరో స్టేజ్ రాగానే బస్సు దిగేస్తారు. ఇక రైళ్లలో అయితే ఏకంగా మత్తు కలిపిన ఆహార పదార్థాలను అందజేసి చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. బ్యాగ్‌లో నగలు పెట్టుకుని ప్రయాణిస్తే మహిళా దొంగలతో రావడైపోతోందని, వారిని గుర్తు పట్టడం కూడా కష్టమేనని ఇటీవల ఓ కేసులో బాధితురాలు వాపోయింది. మెడలో వేసుకుని వెళదామంటే చైన్ స్నాచర్ల బెడద నుంచి కాపాడుకోవడం కష్టంగా మారుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఇక ఇంట్లో సురక్షితంగా ఉంటుందని బీరువాలో దాచి వెళితే.. పట్టపగలే దుండగులు అపహరించుకెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష..

విలువైన వస్తువులు, డబ్బు తీసుకెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలంటున్నారు. అనంతపురం జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన మహిళా దొంగలు జిల్లాలో సంచరిస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తంచేశారు.

'వైద్యుల నిర్లక్ష్యం'పై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు విచారణకు ఆదేశించారు. ఈ నెల 27న రాత్రి ఎంఎం వార్డులో ఇద్దరు రోగులు మృతి చెందిన అంశంపై 'జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యం' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. దీనిపై జీజీహెచ్ సూపరింటెండెంట్ స్పందించారు. వార్డులో ఈశ్వరయ్య, నాగయ్య మృతికి సంబంధించి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహారెడ్డి నుంచి బుధవారం వివరణ తీసుకున్నారు. అనంతరం మృతికి గల కారణాలపై లోతుగా విచారణ చేపట్టేలా సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ రామస్వామినాయక్, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య కమిటీని నియమించారు.

డీఈఓను సరెండర్ చేయండి

- కలెక్టర్‌కు విన్నవించిన ఎమ్మార్పీఎస్

అనంతపురం ఎడ్యుకేషన్: కుల పిచ్చి, నియంతృత్వ ధోరణి, అహంకార వైఖరి, అవగాహనలేమితో జిల్లాలో విద్యావ్యవస్థను గాడి తప్పించిన డీఈఓ వరలక్ష్మిని వెంటనే ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను బుధవారం ఉదయం ఆయన చాంబర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. విద్యా పథకాల అమలులో చురుకుగా ఉంటూ రాష్ట్ర స్థాయిలో మంచి పేరు ఉన్న అనంతపురం జిల్లా ఖ్యాతిని ఆమె మంటగలిపారంటూ ఆరోపించారు. సమగ్ర శిక్ష ఎస్పీడీగా, రెండు సార్లు ఏపీసీ బాధ్యతలను కలెక్టర్ ఇచ్చినా తీసుకోకుండా తన అహంకారాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారానికి సంప్రదించేందుకు వెళ్లిన ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నేతలకు దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. తనకు బంధువులు మంత్రులుగా ఉన్నారని చెప్పుకుంటూ బెదిరింపులకు దిగుతున్న ఆమెకు విద్యాశాఖాధికారిగా కొనసాగే అర్హత లేదని, తక్షణమే ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేసి జిల్లా విద్యాశాఖను ప్రక్షాళన చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి

- ముగ్గురికి తీవ్ర గాయాలు



ఘర్షణకు కారణమైన వాటర్ ప్లాంట్

యాడికి: పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నాయకులు దాడి చేసి గాయ పరిచారు. వివరాలు... మూడేళ్ల క్రితం గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటైంది. ఇప్పటి వరకూ దీని నిర్వహణను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు చూస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాటర్ ప్లాంట్‌ను తామే నిర్వహిస్తామంటూ కొందరు టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో మూడు రోజులుగా వాటర్ ప్లాంట్‌కు తాళం వేసి ప్రజలకు తాగునీరు అందకుండా చేశారు. రెండు రోజులుగా ఎంత బతిమలాడినా తాళం ఇవ్వకపోవడంతో పాటు నానా దుర్భాషలాడుతుండడంతో బుధవారం మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉన్న టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, కాటం కృష్ణ, ఉదయ్ కిరణ్, బాబురెడ్డి కట్టెలు, రాళ్లతో విరుచుకుపడ్డారు. ఘటనలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తక్కలపల్లి బాలనాగన్న తలకు తీవ్ర గాయమైంది. నారాయణ, చాకలి కిట్టకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గ్రామస్తులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

ఇద్దరి దుర్మరణం

- టోల్‌ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదం
- ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



రాజేష్ మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు (ఇన్‌సెట్‌లో) శ్రీనివాసులు(ఫైల్)

యాడికి: వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికిలోని నారాయణస్వామి కాలనీకి చెందిన శ్రీనివాసులు(33)కు భార్య అనూష, 9 నెలల కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని శ్రీనివాసులు పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తాడిపత్రిలో జరిగిన ఓ వివాహ వేడుకకు నార్పల మండలం నాయనపల్లికి చెందిన రాజేష్ (38)తో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. వేడుక ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు యాడికి గ్రామానికి తిరుగు ప్రయాణమైన వారు పెద్దపప్పూరు మండలం చీమలవాగు పల్లి టోల్ ప్లాజా సమీపంలో రైల్వే గేటు వద్దకు చేరుకోగానే ఎదురుగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో రాజేష్‌పై శ్రీనివాసులు పడ్డాడు. ఇద్దరి మీదుగా లారీ టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని నిలపకుండా దూసుకెళ్లిపోయాడు. రాజేష్(38)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఘటనపై పెద్దపప్పూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని...



వివేకానంద (ఫైల్)

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ వద్ద వద్ద బుధవారం ఉదయం కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడిని తాడిపత్రి మండలం బోడాయిపల్లికి చెందిన వివేకానంద (18)గా పోలీసులు గుర్తించారు. బేల్దారి పని కోసం బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తాడిపత్రికి వస్తుండగా టెంపో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడి మృతి చెందాడని, ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పిండినల్లి నివారణ చర్యలు చేపట్టండి

- ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం విద్యార్థుల సూచన



మల్బరీ ఆకులకు ఆశించిన పిండినల్లి

అనంతపురం అగ్రికల్చర్: మల్బరీ (రేషం) తోటల్లో ఇటీవల ఏడాది పొడవునా పిండినల్లి (మీలీబగ్) ఆశించి నష్టపరుస్తోందని, దీని నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు రాప్తాడులోని ప్రాంతీయ పట్టు పరిశోధనా స్థానం (ఆర్ఎస్ఆర్ఎస్) పరిశోధక విద్యార్థులు ఎం.పరశురాముడు, కె.నందిని, వై.ప్రవీణ్‌రెడ్డి, యు.అనిల్‌కుమార్ సూచించారు. ఆర్ఎస్ఆర్ఎస్ జాయింట్ డైరెక్టర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుపురుగుల పెంపకం, చీడపీడలు తదితర అంశాలపై పరిశోధన చేస్తున్న వారు.. మల్బరీ తోటల్లో పిండినల్లి నివారణ చర్యలను వివరించారు. మల్బరీ తోటల్లో పిండినల్లి ఆశిస్తే నివారించడం కష్టమన్నారు. ఏడాది పొడవునా ఆశించడానికి అవకాశం ఉందన్నారు. వేసవిలో మరీ ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. దీన్ని తుక్రా అని కూడా పిలుస్తారన్నారు.

వ్యాధి వ్యాప్తి – నివారణ ఇలా..

తుక్రా ఆశించిన ఆకులు ముడుచుకు పోయి తొలుత ముదురు ఆకుపచ్చగా తర్వాత పసుపురంగులోకి మారుతాయన్నారు. కణుపుల మధ్య దూరం తగ్గిపోయి గంట్లు ఏర్పడతాయన్నారు. దీని వల్ల హెక్టారుకు ఏడాదిలో 4,500 కిలోల ఆకు దిగుబడి తగ్గి పట్టు పురుగుల పెంపకంలో సమస్య తలెత్తుతుందన్నారు. దీని జీవితచక్రం పరిశీలిస్తే 350 నుంచి 500 గుడ్లు పెట్టి 6 నుంచి 9 రోజుల్లో పొదుగుతాయన్నారు. 23 నుంచి 27 రోజులు లార్వా దశలో ఉంటాయన్నారు. తర్వాత కీటకంగా మారి మగ పురుగులు 3 నుంచి 4 రోజులు, ఆడ పురుగులు 10 నుంచి 12 రోజుల పాటు జీవిస్తాయన్నారు. వ్యాధి సోకినట్లు గుర్తిస్తే వెంటనే కొడవలి లేదా కత్తెరతో కత్తిరించేసి పాలిథీన్ కవర్లోపెట్టి కాల్చివేయాలన్నారు. అలాగే లీటర్ నీటికి 0.2 శాతం నువాన్ (డీడీవీపీ 76 శాతం ఈసీ) కలిపి పిచికారీ చేయాలన్నారు. పిచికారీ చేసిన 15 నుంచి 17 రోజుల తర్వాత ఆకును వాడుకోవాలన్నారు. లేదంటే జీవ నియంత్రణ పద్ధతి కింద 250 కీటకాలైన క్రిప్టోలీమస్ మాంట్రోజరి లేదా 500 కీటకాలైన స్కిమ్నస్ కాక్సివోరాలను రెండు విడతలుగా ఆరు నెలలకోసారి పిండినల్లి ఆశించిన తోటల్లో విడుదల చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు.

రైలు నుంచి జారి పడి వృద్ధురాలి మృతి

ధర్మవరం రూరల్: రైలు నుంచి జారి పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని హాసన్ జిల్లా కుంబేనహళ్లికి చెందిన సంజమ్మ (85), తన కోడలు భాగ్యమ్మతో కలసి కొయంబత్తూరు నుంచి బీదర్‌కు రైలులో ప్రయాణమైంది. బుధవారం ధర్మవరం రైల్వే స్టేషన్ దాటి గొళ్లపల్లి వద్ద వేగంగా వెళుతున్న రైలులో టాయిలెట్‌కని వెళ్లిన వృద్ధురాలు అదుపు తప్పి ప్రధాన తలుపు నుంచి జారి కిందపడింది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు బుక్కపట్నం విద్యార్థులు

పుట్టపర్తి: అమలాపురం వేదికగా సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్ఎం జగదీష్, పీడీ నాగరాజు బుధవారం తెలిపారు. తమ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు గణేష్‌రెడ్డి, ముక్తియార్ మంగళవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుంతకల్లు రూరల్: తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి నగదు, విలువైన వస్తువులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని అంజలీ నగర్‌లో బోయ సురేష్... ఉదయాన్నే బేల్దారి పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకుంటాడు. ఆయన తల్లి కూడా ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళుతుంటుంది. ఈ క్రమంలో బుధవారం ఉదయాన్ని ఇంటికి తాళం వేసి ఇద్దరూ పనుల కోసం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తల్లి భోజనం చేసి ఇంటికి తాళం వేసి తాళం చెవులను బాత్‌రూములోని సోప్ బాక్స్ కింద పెట్టి వెళ్లిపోయింది. విషయాన్ని గమనించిన దుండగులు తాళం చెవులు తీసుకుని తలుపు తీసి ఇంట్లోకి చొరబడి రూ.60 వేల నగదు, 3 గ్రాముల బంగారు ఉంగరం, 100 గ్రాముల వెండి సామగ్రిని అపహరించుకెళ్లారు. రాత్రికి ఇంటికి చేరుకున్న బాధితులు చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో కసాపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



విద్యుత్ పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ స్పష్టం చేశారు. బషీర్‌బాగ్ కాల్పుల్లో అసువులు బాసిన విద్యుత్ అమరులకు బుధవారం అనంతపురంలోని నీలిమ సర్కిల్ వద్ద ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2000లో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ హైదరాబాద్‌లో చేపట్టిన పోరాటానికి రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది రైతులు తరలివచ్చారని, ఆ రోజు ఉద్యమాన్ని నీరు గార్చేందుకు రైతుల గుండెల్లో అప్పటి తుపాకీ తూటాలను సీఎం చంద్రబాబు దింపించిన దారుణ దృశ్యాలు నేటికీ కళ్లముందే కదులుతున్నాయన్నారు. ఆ అమరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన చంద్రబాబే... ఇప్పుడు వాటిని అమర్చేందుకు సిద్ధం కావడం సిగ్గు చేటన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికలకు ముందు భరోసానిచ్చి అధికారం చేపట్టిన తర్వాత ఎలా మరిచిపోతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకటనారాయణ, మసూద్, రాజు, లక్ష్మీనారాయణ, నూరుల్లా, రామాంజినేయులు, శీన, నాగేంద్ర, పుల్లన్న, ఫకృద్దీన్, మహేష్, మురళీ, రాము, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గొటుకూరప్ప పరుష





పరుషలో కొలువైన గుడికట్ల దేవుళ్లు, నూతన పూజారిగా బాధ్యతలు తీసుకున్న జోగి గోవర్ధన్

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లిలో 20 ఏళ్ల తర్వాత బుధవారం గొటుకూరప్ప పెద్ద పరుష (జల్లి పూజ) వైభవంగా నిర్వహించారు. రాయలసీమ ప్రాంతంలోని నాలుగు జిల్లాల నుంచి వేలాదిగా స్వామి కాపులు (జోగి, మల్యాల గోత్రం వంశస్తులు) తరలిరావడంతో అయ్యవారిపల్లి జనసంద్రమైంది. కొత్త పూజారిని నియమించే క్రమంలో ఈ పరుషను ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రానికి శ్రీసత్యసాయి జిల్లా తగరకుంట అతకల్లుపట్నం పెదయ్య స్వామి, అనంతపురం జిల్లా కురుగుంట కురుగుంటప్ప, కక్కలపల్లి మదిగుబ్బప్ప స్వామి, బుక్కరాయసముద్రం గుంతకల్లప్ప స్వాములను అయ్యవారిపల్లికి చేర్చారు. బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకు భక్తి శ్రద్ధలతో జల్లి పూజ జరిగింది. అనంతరం గంగపూజ, అభిషేకాలు నిర్వహించారు. బిందే పూజ చేసి జోగి నాగరాజు కుమారుడు జోగి గోవర్ధన్‌ను నూతన పూజారిగా నియమించారు. గొటుకూరప్ప స్వామి ఎదుట మద్దెలచెరువు గ్రామానికి చెందిన బంగారు వంశస్తులు బలిహరణం నిర్వహించారు. కాగా, పరుషలో కాపులు పటాలు ఎక్కుట కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆనవాయితీ ప్రకారం బంధువులు (పుట్టినింటివాళ్లు) కాపులకు తెచ్చిన నూతన వస్త్రాలను ధరించారు. ఈ కార్యక్రమం కురుబల కుల గురువు కర్ణనపర్తి శాంతమూర్తి స్వామి పర్యవేక్షణలో జరిగింది. పరుషలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



గొటుకూరప్ప స్వామి

భద్రత కల్పించాలి



రోగుల ప్రాణాలు కాపాడాలనే సుదుద్దేశంతో సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బందికి దాడుల నుంచి భద్రత కల్పించాలి. రాత్రి వేళల్లోనూ మహిళలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా ఘటన చాలా బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలి. కోల్‌కతా సంఘటనతో మహిళా డాక్టర్లలో ధైర్యం సన్నగిల్లుతోంది. నైట్ డ్యూటీలు చేసే డాక్టర్లకు రక్షణ కరువై విధులకు హాజరు కాలేరు. వారికి అన్ని విధాలా రక్షణతో పాటు సౌకర్యాలు కల్పించాలి. లేని పక్షంలో మహిళ సిబ్బందికి రాత్రి వేళల్లో కాకుండా పగటి వేళల్లో విధులు నిర్వహించేలా చూడాలి.

– మీనా, సీహెచ్‌ఓ, బొమ్మేపర్తి సచివాలయం, రాప్తాడు మండలం



ప్రత్యేక చట్టాలు చేయాలి



ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ఘటన అమానుషం. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆసుపత్రిలో రోగుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు ఎంతో కష్టపడతారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత చట్టాలు మరింత పటిష్టం చేయాలి. విధులు నిర్వర్తించే ఇతర అధికారులపై చేయి చేసుకోవడం ఎంత నేరమో అలాగే విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడి చేయడం, అమర్యాదగా మాట్లాడే వారిని కఠినంగా శిక్షించాలి. భద్రత కోసం ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావాలి. వైద్యులంటే ప్రాణరక్షకులన్న గౌరవంతో పాటు వారి జోలికి వెళితే చట్టాలు వదలవు అన్న భయం రావాలి.

– మాజీదా, సీహెచ్‌ఓ, మరూరు-1 సచివాలయం, రాప్తాడు మండలం

క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి



సైఫుల్లా బ్రిడ్జ్ వద్ద శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి ఆదేశించారు. ఇటీవల వర్షాలు వచ్చినప్పుడు 45వ డివిజన్ సైఫుల్లా బ్రిడ్జ్ వద్ద కాలువలు బ్లాక్ అవడంతో వాటిపై ఉన్న బిల్లలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి పర్యవేక్షణలో పూడిక తీయించి, కాలువలపై బిల్లలు వేసేలా చర్యలు తీసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు.

జేఎన్‌టీయూ పీఆర్వోగా ఓం ప్రకాష్



అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా ఓం ప్రకాష్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన వీసీ, రిజిస్ట్రార్‌కు ఓం ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ పథకాలపై సమీక్ష

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ పథకాల అమలుపై ట్రైనీ కలెక్టర్ వినూత్న సమీక్షించారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా టెక్నికల్ ఏఓలు, క్లరికల్ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలు, ఇతరత్రా సేవలు, ఆర్‌ఎస్‌కేల పనితీరు, విత్తన పంపిణీ, వర్షాలు, పంటల స్థితిగతులు, రైతుల పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అలాగే వ్యవసాయ శాఖ పాలన విభాగాల పనితీరు, క్షేత్రస్థాయి సిబ్బందిపై ఆరా తీశారు. కేవలం వర్షాలపై ఆధారపడి మెట్ట వ్యవసాయం సాగిస్తున్న జిల్లా రైతులకు ప్రభుత్వ ఫలాలు సరిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

120 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: మండల కేంద్రంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం కడప జిల్లాకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరానికి రాప్తాడు, కూడేరు, కనగానపల్లి మండలాల నుంచి కంటి జబ్బుతో బాధపడే 120 మంది రోగులు హాజరయ్యారు. పుష్పగిరి కంటి ఆస్పత్రి కో–ఆర్డినేటర్ లక్ష్మణ్ రోగులను పరీక్షించారు. దాదాపు 30 రోగులను ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆప్తమాలిక్ అసిస్టెంట్స్ శిరీషా, జరినా, చందు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్: విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు సూచించారు. బుధవారం జేఎన్‌టీయూలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. రాబోయే కాలంలో కొత్త కోర్సులు, విద్యార్థులకు సులభంగా బోధించే విధంగా అధ్యాపకులకు మరికొన్ని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, సీనియర్ ప్రొఫెసర్లు కె.హేమచంద్రా రెడ్డి, ప్రశాంతి, దుర్గాప్రసాద్, నాగప్రసాద్ నాయుడు, చంద్రమోహన్ రెడ్డి, శివ కుమార్, రామశేఖర రెడ్డి, అజిత, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన దంపతులు గంజి యల్లమ్మ, గంజి ఇటుకు నల్లప్ప రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. బుధవారం ఉదయం దంపతులు ఇద్దరూ ద్విచక్ర వాహనంలో అయ్యవారిపల్లి గ్రామంలో జరుగుతున్న గొటుకూరప్ప స్వామి పెద్ద పరుషకు వచ్చారు. మధ్యాహ్నం ద్విచక్ర వాహనంలో రాప్తాడుకు తిరుగు పయనమయ్యారు. 44వ జాతీయ రహదారిపై డివైడర్ల సందులో ద్విచక్ర వాహనాన్ని దాటిస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో గంజి యల్లమ్మ పరిస్థితి విషమంగా ఉంది.

మధురం.. తెలుగు భాష సౌందర్యం

సందర్భం: నేడు తెలుగు భాషా దినోత్సవం

తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
యెల్ల నృపులు గొలువ నెరుగవే బాసాడి
దేశ భాషలందు తెలుగు లెస్స ..

అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించిన తెలుగు భాష పంచాధార కన్న.. కమ్మని తేనె కన్న మధురమైనదని ఎంతో మంది ప్రాచీన, ఆధునిక కవులు తమదైన సాహితీ సృజనతో భాషాభిమానాన్ని చాటుకున్నారు. తల్లి ప్రేమకు సరిసాటిగా భాసిల్లిన తెలుగు భాషను ఎందరో మహనీయులు సుసంపన్నం చేశారు. వారిలో అనంత వాసులూ ముందు వరుసలోనే ఉన్నారు. భాషా వికాసానికి ఇతోధికంగా తోడ్పాటునందిస్తూ భాషా వైభవాన్ని ఘనంగా చాటుతున్నారు. మాతృభాషా సౌందర్యాన్ని గుర్తు చేయడం కోసం సుప్రసిద్ధ భాషా సేవకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఏటా ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నారు.

– అనంతపురం కల్చరల్:



తెలుగు తల్లి విగ్రహం

మాతృభాషా ప్రచారంలో చెరగని ముద్ర

మాతృభాషా ప్రచారంలో అనంత వాసులది తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర. ఎంతో మంది భాషావేత్తలు రచయితలుగా, కవులుగా మారి జాతీయ పురస్కారాలు అందుకుని అనంత ఖ్యాతిని ఘనంగా చాటారు. కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు భాషా పురస్కారం, డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్యం వంటి పురస్కారాలు అందుకుని యువతరానికి స్ఫూర్తినిచ్చారు. సాహిత్యానికి మాత్రమే కాకుండా తెలుగు భాషా వికాస ఉద్యమం పేరుతో డాక్టర్ జగర్లపూడి శ్యామ సుందరశాస్త్రి, తెలుగు రక్షణ వేదిక పేరుతో పొట్లూరి హరికృష్ణ, తెలుగు భాషా పరిరక్షణ సమితి ద్వారా డాక్టర్ నారాయణ భాషా సేవలో తరిస్తున్నారు. అలాగే జిల్లా రచయితల సంఘం, సాహిత్య భారతి, తెలుగు వెలుగు, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి తదితర సంస్థలు తెలుగు తల్లికి నీరాజనాలర్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గురువారం తెలుగు తల్లి కూడలి వద్ద ఉదయం 9 గంటలకు తెలుగు భాష సౌందర్యాన్ని ప్రతిబింబించే ఊరేగింపులు, భాషా సమావేశాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

భాషా సేవకులు ఈ దంపతులు



గొల్లాపిన్ని దంపతులు

నగరానికి చెందిన గొల్లాపిన్ని సీతారాం, పాణ్యం వసుంధర దంపతులు దశాబ్దాలుగా భాషా సేవలో తరిస్తున్నారు. సీతారాం విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడైనా ఆధ్యాత్మిక వ్యాసాల పరంపర కొనసాగిస్తూ నిత్యం వివిధ పత్రికల్లో కనపడుతుంటారు. ఆయన వద్ద 8 మంది ఎంఫిల్, ఒకరు పీహెచ్‌డీ చేశారు. ఆంగ్లంతో పాటూ ఆంధ్రంలో అందరికి మంచి పట్టు ఉండాలని శ్రమిస్తున్నారు. ఇక పాణ్యం వసుంధర బాల్యం నుంచే తెలుగు భాషపై మమకారంతో 1974లోనే హైదరాబాద్‌లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభల్లో విద్యార్థి ప్రతినిధిగా పాల్గొన్నారు. ఇప్పటి వరకు తెలుగు భాషా ఔన్నత్యంపై వందల సార్లు ఆకాశవాణిలో ప్రసంగాలు చేశారు. కవితా గోష్టులు, కవి సమ్మేళనాలు, భాషా సాహిత్యోపన్యాసాలిస్తున్న ఆమెను సాహిత్య పత్రికలు గౌరవ సంపాదకురాలిగా నియమించుకున్నాయి. దూరదర్శన్‌లో సైతం 'పద్యాలతో రణం' శీర్షికను నిర్వహించారు. 'పాఠశాలల్లో తెలుగు బోధన–సాలోచనాత్మక పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసి గౌరవ డాక్టరేట్, గోల్డ్ మెడల్ అందుకున్నారు. అవధానాల్లో పృచ్ఛకత్వం చేసే అరుదైన మహిళల్లో ఒకరైన ఆమె పాఠాలను పాటలుగా మార్చి బోధన చేయడం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చింది. ఆమె కూడా సోషియల్ ఉపాధ్యాయిని కావడం విశేషం. 'ఈ తరం వారికి సాహిత్య పఠనం చేయించడం, తెలుగు భాషను ప్రేమిస్తూ ఇతర భాషలను గౌరవిస్తేనే భాష పట్ల పట్టు పెరుగుతుందని' చెప్పే ఆ దంపతులు తెలుగు భాషా సేవకులుగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమే!



నామినేషన్లు వేస్తున్న కార్పొరేటర్లు, చిత్రంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు పోటీదారులెవరూ లేకుండా ఏకగ్రీవం కానున్నాయి. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు పోటీ అనివార్యమని చర్చ జోరుగా సాగింది. వాటికి తెరదీస్తూ.. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారు. ఇప్పటి వరకు 15 మంది కార్పొరేటర్లకు అవకాశం కల్పించారు. తాజాగా కొత్త వ్యక్తులకు స్టాండింగ్ కమిటీలో అవకాశం కల్పించారు. కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు (ఎస్సీ), అనిల్ కుమార్ రెడ్డి (ఓసీ), రహంతుల్లా (బీసీ, ముస్లిం మైనార్టీ), నాగవినూత (బలిజ), సుజాత (బలిజ) నామినేషన్ వేసేందుకు అవకాశం కల్పించారు.

మేయర్ సమక్షంలో నామినేషన్

మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యల సమక్షంలో నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ స్థానాలకు బుధవారం కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, అనిల్‌కుమార్ రెడ్డి, రహంతుల్లా, నాగవినూత, సుజాత, తదితరులు నామినేషన్ దాఖలు చేశారు. అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, కార్యదర్శి సంగం శ్రీనివాసులకు వారు నామినేషన్ పత్రాలను అందించారు. వచ్చే నెల 5న స్టాండింగ్ కమిటీ సభ్యుల జాబితాను నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి ప్రకటించనున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, లాలూ, అబూసలేహా, శ్రీనివాసులు, టీవీ చంద్రమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్కేవ'లో క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: భారత హాకీ క్రీడాకారుడు దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఎస్కేవ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి, జిల్లా క్రీడా అధికారి షఫీ క్రీడాపోటీలను ప్రారంభించారు. చెస్, వాలీబాల్, త్రోబాల్, హాకీ, ఫన్ గేమ్స్ నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీనాథ్, ఫిజికల్ డైరెక్టర్ కొండారెడ్డి, ఎం.శ్రీనివాసులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొల్హాపూర్ మహాలక్ష్మికి పూజలు



హోమం చేస్తున్న అర్చకులు



అలంకరణలో కొల్హాపూర్ మహాలక్ష్మి

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని శ్రీవలీస్వామి ఆశ్రమంలో బుధవారం కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారి భక్తి సంకీర్తనలతో పరిసరాలు మార్మోగాయి. ఆశ్రమ నిర్వాహకుడు విజయ్‌కుమార్ నేతృత్వంలో ఉదయం జరిగిన సమావేశంలో విరూపాక్ష దత్త పీఠాధిపతి నృసింహ భారతీ స్వామీజీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్వామి అక్కల్ కోట మహారాజ్ ఆశ్రమం ద్వారా సాగుతున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను అభినందించారు. వేదపండితులు ఉదయ్ భాస్కర్ బృందంతో కలిసి గణపతి పూజలు, శ్రీలక్ష్మీనారాయణ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 116 మంది మహిళలకు అమ్మవారి తరపున సామూహిక ఒడిబియ్యం అందించారు. నూతనంగా నిర్మించిన మీనాక్షమ్మ మందిరాన్ని సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. కొల్హాపూర్ అమ్మవారు, ఆంజనేయ, నవగ్రహాల విగ్రహాలను ఏడాది కిందట ప్రతిష్ఠించినట్లు తెలిపారు. కొల్హాపూర్‌లో జరిగే ప్రతి కార్యక్రమం ఇక్కడా జరుగుతుందన్నారు. వందల సంఖ్యలో భక్తులు బారులు తీరి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులు చిట్టా శ్రీధర్, అంబటి మల్లికార్జున, అశ్వర్థ నారాయణ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

'కులం పేరుతో దూషించి దాడి చేశారు'



చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చెన్నేకొత్తపల్లి: ఇటీవల స్కూల్ కమిటీ డబ్బు విషయమై ప్రశ్నించినందుకు చైర్మన్ రామలింగప్ప, అతని కుటుంబ సభ్యులతో పాటు మరికొందరు తమను కులం పేరుతో దూషించడమే కాకుండా ఇంటి వద్దకు వచ్చి దాడి చేశారని వెంకటంపల్లి ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) వైస్ చైర్‌పర్సన్ ఇందిర వాపోయారు. తన భర్త రాజుపై దాడి చేయడంతో తలకు గాయమైందని, తనను కూడా మెడపై గట్టిగా కొట్టారని తెలిపారు. కాళ్లావేళ్లా పడి వేడుకున్నా వదలకుండా దాడి చేశారన్నారు. వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ బుధవారం ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, గ్రామస్తులతో కలసి బాధితులు చెన్నేకొత్తపల్లి పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిందితులను అరెస్టు చేసి.. తగిన న్యాయం చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



బద్దలాపురంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కనగానపల్లి: రాజకీయ, వర్గకక్షలతో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిసే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని బద్దలాపురం గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ధర్మవరం డీఎస్పీ ఆధ్వర్యంలో రామగిరి సీఐ శివాంజనేయులు, కనగానపల్లి, రామగిరి సర్కిల్ పోలీసులతో కలసి గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా అనుమానస్పదంగా ఉన్న వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. రికార్డులు సరిగా లేకుండా తిరుగుతున్న 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అక్రమ మద్యం విక్రయాలపై ఆరా తీశారు. గ్రామంలో ఉన్న రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ వైషమ్యాలతో గొడవలు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ సారూ కరుణించరూ..!



ఆస్పత్రి వెనుక భాగంలో భోజనం చేస్తున్న గర్భిణులు

- రివాల్వింగ్ గేట్ మూత
- నేలపైనే గర్భిణుల భోజనం

అనంతపురం మెడికల్: జిల్లా అధికార యంత్రాంగం తీసుకున్న నిర్ణయం గర్భిణు బాలింతలు, రోగులు, ఉద్యోగులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఆస్పత్రిలో ఆగంతకులు వస్తారన్న కారణాన్ని చూపి రోగులను ఇబ్బందులకు గురి చేసేలా ఆస్పత్రి వెనుకవైపు ఉన్న రివాల్వింగ్ గేట్‌ను మూసివేసేలా చర్యలు తీసుకున్నారు. దీని ఫలితంగా గర్భిణులు, బాలింతలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. రోజూ సర్వజనాస్పత్రికి వివిధ ప్రాంతాల నుంచి పేద రోగులు వస్తుంటారు. అందులో గర్భిణులు, బాలింతలు ఉదయం వస్తే.. వైద్యులతో చూయించుకుని సాయంత్రానికి వెళ్లే పరిస్థితి ఉంటుంది. ఆ సమయంలో భోజనం చేయడానికి ఆస్పత్రి నుంచి దూరం వెళ్లలేరు. ఆస్పత్రి వెనుక వైపు ఉన్న చిరు హోటళ్లలోనే భోజనం చేసే వారు. రివాల్వింగ్ గేట్ మూసివేయడంతో గేట్ ముందరే కటిక నేలపై కూర్చుని బాలింతలు భోజనం చేశారు. ఇలాంటి పరిస్థితులను రోజూ చూడాల్సి వస్తోందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా ఆస్పత్రి సిబ్బంది సైతం రివాల్వింగ్ గేట్ మూసివేయడంతో.. ఆస్పత్రి చుట్టూ ప్రదక్షణలు చేస్తూ రావాల్సి వస్తోంది. కనీసం ఉదయం 8 గంటల, మధ్యాహ్నం షిఫ్టులో 2 గంటలకు, రాత్రి 8 గంటల షిఫ్ట్‌లో గంటపాటు రాకపోకలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సిబ్బంది కోరుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

మోంగోడిబీ సర్టిఫికేషన్‌లో ప్రతిభ



సర్టిఫికెట్ అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

రాప్తాడు: శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మోంగోడిబీ సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబరిచారని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వెన్నపూస రమాకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధునిక డేటా బేస్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులు సత్తా చాటారన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు మోంగోడీబీ ఉపయోగపడుతుందన్నారు. కళాశాలలో 200 మంది మోంగోడీబీ సర్టిఫికేషన్‌లో విజయం సాధించడం గర్వకారణమన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రవికిషోర్ మాట్లాడుతూ.. మోంగోడీబీ నుంచి వచ్చిన ఈ గుర్తింపు తమ కళాశాలకు గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఏఓ శివా రెడ్డి, ఐసీటీ రీజనల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, హెచ్ఓడీఎస్ రంజిత, రంగస్వామి, హేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఆయా గ్రామ పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 80 శాతం సబ్సిడీతో ఉలవలు, అలసందలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉలవలు 10 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.870 కాగా.. సబ్సిడీ పోనూ రూ.174 చెల్లించాలన్నారు. అలాగే 8 కేజీల ప్యాకెట్ అలసందలు పూర్తి ధర రూ.904 కాగా సబ్సిడీ పోనూ రూ.181 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, రైతు వాటా మొత్తంతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మూడో రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం శ్రీ కృష్ణ పరమాత్ముడి విగ్రహాన్ని పూల పల్లకీలో కొలువుదీర్చి ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూల పల్లకీని భుజాలపై మోశారు. ఊరేగింపుకు ముందు శ్రీకృష్ణుడిని కొలువుదీర్చిన మంటపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

మరుగుదొడ్లపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 ప్రసూన్ కుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పాఠశాలల్లో నిర్మించిన మరుగుదొడ్లపై దృష్టి సారించాలని మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసూన్‌కుమార్ నాయుడు సూచించారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి వాటి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. వాటిని ఏ విధంగా చేయాలి అనే విషయంపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు హోమాలు, పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.